# 3

## జరిమానా

బలరామపురం జమీందారు భానోజీరావు గారికి భవాని అనే కుమార్తె వుంది. రవణక్కపేట ముకాసాదారు రామారాయణిం గారికి రంగారావనే కుమారుడు వున్నాడు.

'వియ్యానికైనా, కయ్యానికైనా సమానులు కావా'లని సామ్యం వుంది.

రామారావుగారూ, రాయణింగారూ, సమానులే గనుక వియ్యమందారు. భవానికీ, రంగారావుకీ పెండ్లి ఐంది. రావుగారు ఆకాశమంత పందిరీ, భూమిఅంత అరుగూ వేసి, అతివైభవంగా చేశారు పెళ్లి.

పెళ్లిలో అలకపాన్పుమీద అల్లుడేదో ఒకటి కోరడం, మామగారు ఆ కోర్కెను తీర్చటం ఒక

ముచ్చట కదా? రంగారావు వజ్రపుటుంగరాన్ని కోరాడు. భానోజీరావుగారు రెండువేల రూపాయల ఖరీదైన అసలైన వజ్రాన్ని బొంబాయినుంచి తెప్పించి, సిసలైన బంగారంతో ఒక గొప్ప పనివాడిచేత ఉంగరం తయారు చేయించి, అల్లుని చేతివేలికి అలంకరించారు.

పగలు సూర్యకాంతీ, రాత్రి దీపకాంతీ పడి ఆ వజ్రం తళతళా మెరిసిపోయేది. దాన్ని చూసుకుని ఆ పెళ్ళికొడుకు మురిసిపోయేవాడు. ఎప్పుడూ వేలినుండి దాన్ని తీసేవాడే కాదు.

ఇలా కొంతకాలం జరిగేసరికి, ఉన్నట్టుండి రంగారావుకి ఎక్కడా చోటు లేనట్లు ఆ వేలుమీదే ఒక కణుపు చెప్ప వేసింది. వేసి, వేలంతా పొట్లకాయలాగ ఇట్టే వాచిపోయింది.

వేలు వాచటంవల్ల ఉంగరాన్ని తియ్యటానికి వీల్లేక పోయింది. ఉంగరం మూలాన బాధ ఒకటికి రెండింతలైంది.

జమీందార్లు గనక వారికి వైద్యానికి లోటేమిటి? ఇంగ్లీషువైద్యం, నాటువైద్యం, ఉమాపతివైద్యం — ఒక టేమిటి? అన్ని వైద్యాలూ చేయించారు. కాపటాలు పెట్టేరు. కట్లు కట్టేరు. ఆఖరికి మంత్రం కూడా వేయించారు.

కాని లాభంలేకపోయింది. రంగారావు అమితబాధ పడిపోయాడు. బాధలోనూ యమబాధ పడ్డాడు. వాచి పోయిన ఆ వేలుకి బిగిసిపోయిన ఆ ఉంగరం ఇదివరలో ఎంత ప్రాణప్రదమైందో ఇప్పు డంత బాధాకరమై కనపడింది.

అతడు 'అమ్మోయ్, బాబోయ్' అని మూలుగు

తోంచే అతని భార్య భవానికి గుండె నీరైపోయింది. ఆమె కప్పుడు హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది.

ఆమె వెంటనే దేవతార్చన గదిలోకి వెళ్లి, తిరుపతి వెంకటేశ్వరస్వామిపటం ముందు కర్పూరం వెలిగించి మొక్కి, "స్వామీ, నా భర్తకు ఈ బాధ తప్పించి వేలు నయం చేస్తివా, ఆ వజ్రపుటుంగరాన్ని నీకు సమర్పించుకుంటాము" అంది.

అదేమి మహాత్మ్యమోగాని ఆ మర్నాటినుంచే రంగారావుకురుపు సలుపు తగ్గటం ప్రారంభించి, క్రమంగా వాపు తీసింది. వేలు పాటారిపోయిన ఏటికిమల్లే ఇట్టే సన్నమై అంత వరకూ బిగిసి కూర్చున్న అంగుళీయకం అటూ ఇటూ జరుపుతే కదలసాగింది.

ఎలా తగ్గిందంటే ఎలా తగ్గిందని అడిగా రంతా. "అంతా ఆ వెంకటాచలపతి కటాక్షం!" అంది భవాని. తను ఉంగరాన్ని ఇస్తానని మొక్కుకున్న సంగతిని అందరికీ చెప్పింది.

ఆ మాట వినటంతోనే రంగారావు, "అయ్యో, ఉంగరా న్నెందుకు యిస్తానన్నావు? మరోకటేదైనా మొక్కుకోలేక పోయావా?" అన్నాడు.

"ఏమో, ఆ ఆపద సమయంలో నాకు అప్పుడలా తోచింది మరి" అంది భవాని.

ఒకమాసం గడిచింది, "ఏమండీ, తిరుపతి వెడదామా?" అంది భవాని.

"వెడదాంలే. తొందరేమిటి?" అన్నాడు రంగారావు.

"అదేమన్నమాట? 'ఆపద మ్రొక్కులూ సంపద మరపులూ' అన్నట్లు చెయ్యకండి! ఎల్లుండి విదియనాడు ప్రయాణానికి మంచిదన్నారు శాస్త్రులుగారు. మీరూ నేనూ వెళ్లి, ఆ ఉంగరాన్ని స్వామివారి హుండీలో పడేసి ఒక దణ్ణం పెట్టి చక్కా వద్దాం" అంది భవాని.

"వెడదాంగాని, ఉంగరమే పడెయ్యాలా? పెళ్లిలో మామగారిచ్చిన ఉంగరం ఇది; నేను మనసుపడి కోరి పుచ్చుకున్నదిని!" అన్నాడు రంగారావు.

"అంత మనసుగా వుంటే మళ్ళీ చేయించుకోవచ్చు. సంగతి తెలిస్తే మా నాన్నే చేయించి యిస్తాడు మళ్ళీని" అంది భవాని.

"నిజమేగాని మళ్ళీ యిలాంటి పోడి దొరుకుతుందో లేదో! దొరికినా ఈ ఉంగరంమీద ఉన్నంత మోజు నాకు యింకో ఉంగరంమీద ఉండమంటే వుండదు" అనేశాడు రంగారావు.

తన మంగళసూత్ర మంటే తన కెంత గౌరవమో, ఆ ఉంగరమంటే ఆయన కంత గౌరవం అని ఆమెకు తెలుసు. అందుచేత ఆమె దాన్ని స్వామికి సమర్పించవలసిందని ఆయనను బలవంతం చెయ్యలేకపోయింది. కాని తీరా ఇస్తామని మ్రొక్కుకున్నాక ఇవ్వకుండా ఎలా అని తటపటాయించింది.

ఆ సాయంత్రం శాస్త్రిగారు పురాణం చెప్పటానికి వచ్చినప్పుడు ఉంగరం విషయంలో ఏం చేస్తే బాగుంటుందీ అని అలహా అడిగింది. ఆయన బాగా ఆలోచించి, "ఉంగరమే

ఇవ్వనక్కర్లేదమ్మా. అదెంత విలువచేస్తుందో ఖరీదుకట్టి, ఆ సొమ్మును హుండీలో వేసి చక్కా వస్తే సరి. హుండీలో చేరిన నగలనన్నింటినీ దేవస్థానంవారుకూడా అమ్మేసి సొమ్ము చేస్తారు కదా? అందుచేత ఉంగరానికి బదులు మీరు సొమ్మే ఇవ్వవచ్చు,'' అని సలహా చెప్పేరు.

ఆ సలహా భవానికీ, రంగారావుకీ నచ్చింది. అప్పటి ధరల ప్రకారం ఆ వుంగరం విలువ రెండువేలా ఐదువందలని తేలింది. బ్యాంకులోంచి సరికొత్తవి నూరురూపాయల నోట్లు ఇరవైఐదూ తెప్పించి, వాటిని హుండీలో పడెయ్యటంకోసం ప్రత్యేకం ఒక పట్టుదారంతో కట్టగా కట్టి జాగ్రత్తపెట్టేడు రంగారావు. విదియనాడే ఆ దంపతులు బయలుదేరి తిరుపతికి వెళ్ళేరు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీ నిలువు యెత్తున ఉంటుంది. దాని మూతి పెద్ద గళ్ళాకుమల్లే వుండి, అందులో పడేసీ పడెయ్యటంతోటే ముడుపులన్నీ అడుక్కి చేరుకుంటాయి.

తక్కిన భక్తులతోపాటు భవానీ రంగారావులు హుండీని చేరుకున్నారు. రంగారావు పచ్చనోట్ల కట్టను పైకి తీశాడు. 'ఏడుకొండలస్వామిని ఒక్కమారు తలుచుకుని హుండీలో వెయ్యండి' అంది భవాని.

అప్పుడే స్వామిదర్శనం చేసి వచ్చారు గనక రంగా రావుకి వెంకటరమణమూర్తి విగ్రహం కళ్ళకు కట్టినట్లే ఉంది. మనస్సులోనే నమస్కరిస్తో అతడు చేతిని గళ్ళా మూతిలోనికి

పోనిచ్చి నోట్లకట్టను జారవిడిచాడు. అప్పుడా కట్టకు కట్టి వున్న పట్టుదారం అతని వేలి ఉంగరానికి తగులుకుంది. కురుపు మానేక వేలు బాగా కుషిక్కించిఉండటంవల్ల ఉంగరం వదులుగా జారివచ్చి, నోట్లకట్టతోబాటు హుండీ అడుక్కిపోయి వడ్డికాసులస్వామికి అర్పణ ఐపోయింది!

రంగారావు ఉత్తివేలును చూసుకు తెల్లబోయాడు. 'ఏమిటండీ!' అంది భవాని. 'ఉంగరం హుండీలోకి జారిపోయింది!' అన్నాడాతడు.

"అందుకే 'ఎవడి అప్పైనా ఎగగొట్టగలం గాని,తిరుపతి దేవుని అప్పు ఎగగొట్టలే'మంటారు మనవాళ్ళు. మనం ఇస్తామని చెప్పి ఇవ్వనందుకు ఉంగరాన్ని ఆయనే లాక్కున్నాడు!" అంది భవాని.

"సరేకాని ఉంగరంతోబాటు నోట్లకట్ట కూడా పుచ్చుకున్నాడే మరి?" అన్నాడు రంగారావు.

"మనం చేసిన తప్పుకు జుల్మానాకింద ఆ నోట్లను పుచ్చుకున్నాడు స్వామి! ఎంత ముక్కువగల వస్తువునైనా 'ఇస్తాను' అన్నప్పుడు యిచ్చెయ్యవలసిందే మరి" అంది భవాని.

'నిజమే' ననుకుంటూ రంగారావు లెంపలు వేసుకొని, భార్యతోసహా ఇంటికి చేరుకున్నాడు.